క్లుప్తంగా

కుట్టు మిషను అందజేత



తెనాలి: పట్టణంలోని 16వ వార్డుకు చెందిన నందం విజయలక్ష్మి అనే మహిళ ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కోవడంతో.. అదే వార్డుకు చెందిన యనమద్రి శ్యామ్‌కుమార్ రూ.14 వేల విలువైన కుట్టు మిషనును అందజేశారు. గురువారం సాయంత్రం ఎమ్మెల్యే అన్నాబత్తుని శివకుమార్ చేతుల మీదుగా దానిని అందజేశారు. మున్సిపల్ వైస్ చైర్‌పర్సన్ అత్తోట నాగవేణి, క్లస్టర్-2 పార్టీ అధ్యక్షుడు షేక్ దుబాయ్‌బాబు పాల్గొన్నారు.

జగ్గడిగుంటపాలెంలో 'వికసిత్ భారత్'



తెనాలిటౌన్: జగ్గడిగుంటపాలెం సచివాలయంలో గురువారం వికసిత్ భారత్ సంకల్ప యాత్ర సభను నిర్వహించారు. సర్పంచ్ కుంభం బాలాజీ అధ్యక్షత వహించారు. ముఖ్య అతిథిగా పాల్గొన్న జిల్లా పరిషత్ సీఈవో మోహనరావు కేంద్ర ప్రభుత్వ పథకాలను వివరించారు. సీఈవోకు సర్పంచ్ బాలాజీ జ్ఞాపికను అందజేశారు. ఎంపీడీవో వి.ప్రతాపరెడ్డి, పీఆర్ఏఈ ఎం.వెంకటేశ్వరరావు, హౌసింగ్ ఏఈ శ్రీనివాస్, ఏపీఎం జయశ్రీ, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

వెయిట్ లిఫ్టింగ్‌లో విద్యార్థినికి వెండి పతకం



తెనాలిఅర్బన్: గత నెలలో జరిగిన రాష్ట్రస్థాయి వెయిట్ లిఫ్టింగ్ (50 కిలోల విభాగం)లో తెనాలి శ్రీ చైతన్య జూనియర్ కళాశాలలో ఇంటర్ బైపీసీ చదువుతున్న కె.హర్షిత నాగసాయి రెండవ స్థానాన్ని సాధించి, వెండి పతకం అందుకుందని కళాశాల ప్రిన్సిపల్ బి.తిరుపతిరావు తెలిపారు. గురువారం విద్యార్థినికి శానిటరీ ఇన్‌స్పెక్టర్ ఆకురాతి రామచంద్రరావు వెండి పతకాన్ని అందజేసి, అభినందించారు. కార్యక్రమంలో చైతన్య విద్యా సంస్థల ప్రిన్సిపల్స్ ఎస్.సునీల్‌కుమార్, కె.శ్రీనివాసరావు, పలువురు అధ్యాపకులు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

11న నగరంలో సైకిల్ ర్యాలీ

నెహ్రూనగర్: కాలుష్య రహిత నగరంగా గుంటూరును మార్చుకోవడానికి ప్రతి ఒక్కరూ కృషి చేయాలని వి నర్చర్ ఐటీ చైర్మన్ సంపూర్ణ పేర్కొన్నారు. గురువారం ఇన్నర్‌రింగ్ రోడ్డులోని కార్యాలయంలో నిర్వహించిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడుతూ నగరంలో కాలుష్యాన్ని తగ్గించేందుకు, ప్రతి ఒక్కరూ కాలుష్య రహిత నగర సాధన దిశగా సాగిందేకు యువతతో కలిసి 11న గుంటూరు నగరంలో సైకిల్ ర్యాలీ నిర్వహిస్తున్నట్లు చెప్పారు.

హజ్‌యాత్రకు వెళ్లే వారు దరఖాస్తు చేసుకోండి

తాడేపల్లిరూరల్: హజ్ యాత్రకు గుంటూరు జిల్లా నుంచి వెళ్లదలచిన వారు ఈ నెల 20వ తేదీలోపు ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలని వైఎస్సార్ సీపీ మైనార్టీ విభాగం జిల్లా ప్రధానకార్యదర్శి షేక్ సుభాని తెలిపారు. గురువారం దుగ్గిరాల ముర్తుజానగర్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ భారత హజ్ కమిటీ తన కార్యకలాపాలను ప్రకటించిందని, హజ్ యాత్రకు వెళ్లేవారు దరఖాస్తులను http://hajjcommiŠsŒæree.gov.ap.in హజ్ కమిటీ వెబ్‌సైట్ ద్వారా పంపాలని అన్నారు. పాస్‌పోర్టు వ్యాలిడిటీ 2025 జనవరి 31 వరకు ఉన్న యాత్రికులు మాత్రమే అర్హులని తెలిపారు. రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి యాత్రికులకు ప్రత్యేకంగా ఆర్థిక సహకారాన్ని అందిస్తున్నారని, ఈ ఏడాది రాష్ట్రం నుంచి 1813 మంది హజ్ యాత్రను విజయవంతంగా పూర్తిచేశారని అన్నారు. హజ్ యాత్ర 2024కు రాష్ట్రం నుంచి 2930 మందికి అనుమతి లభించిందని తెలిపారు.

చోరీపై కేసు నమోదు

గుంటూరు ఈస్ట్: ఇంట్లో బంగారు ఆభరణాలు చోరీకి గురైన ఘటనపై పట్టాభిపురం పోలీసులకు ఫిర్యాదు చేసినా పట్టించుకోవడం లేదని బాధిత మహిళ సోషల్ మీడియా వేదికగా ప్రచారం చేసింది. వివరాల్లోకి వెళితే శ్యామలానగర్ 1వలైనుకు చెందిన సుజాత అనే మహిళ గృహంలో వారం రోజుల క్రితం ఐదున్నర సవర్ల బంగారు ఆభరణాలు చోరీకి గురయ్యాయి. ఇంట్లో అందరూ ఉన్న సమయంలోనే నగలు చోరీకి గురైనట్లు ఫిర్యాదు చేసేందుకు స్టేషన్‌కు వెళ్లగా పోలీసులు పట్టించుకోలేదని ఆవేదన వ్యక్తం చేసింది. ఈ విషయం సోషల్‌మీడియాలో వైరల్ కావడంతో స్పందించిన పోలీసులు గురువారం చోరీ ఘటనపై కేసు నమోదు చేశారు. బాధితురాలి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌హెచ్ఓ నరేంద్రబాబు తెలిపారు

యుద్ధప్రాతిపదికన నష్ట నివారణ చర్యలు

- పంట కాల్వల్లో గుర్రపుడెక్క తొలగింపు
- వరి పొలాల్లో నీరు బయటకు పంపిన కూలీలు
- ప్రత్యేక చర్యలు తీసుకున్న ఇరిగేషన్ అధికారులు

తెనాలిటౌన్: మిచాంగ్ తుపాను నష్ట నివారణ చర్యలు యుద్ధ ప్రాతిపదికన జరుగుతున్నాయి. తెనాలి నియోజకవర్గ పరిధిలో వివిధ కాల్వల్లో పేరుకుపోయిన గడ్డి, తూటికాడ, గుర్రపు డెక్క ఆకులు తొలగింపునకు ఇరిగేషన్ అధికారులు చర్యలు చేపట్టారు. ఎమ్మెల్యే అన్నాబత్తుని శివకుమార్ ఆదేశాల మేరకు తెనాలి, కొల్లిపర మండలాల పరిధిలో వివిధ ఇరిగేషన్ కాల్వల్లో గురువారం పూడికతీత చేపట్టారు. వరి పొలాల్లో నిల్వ ఉన్న వర్షపు నీటిని బయటకు పంపేందుకు ఇరిగేషన్ ఈఈ మల్లికార్జున, డీఈ ప్రసాద్‌ల ప్రత్యేక చర్యలు చేపట్టారు. ఐతానగర్ పొలిమేర చానల్, నందివెలుగు, అత్తోట పొలిమేర, హాఫ్‌పేట కాల్వల్లో గుర్రపుడెక్కను తొలగించారు. ఇందుకు సుమారు 50మంది కూలీలను ఏర్పాటు చేసి, పనులు చేసినట్లు ఇరిగేషన్ డీఈ ప్రసాద్ తెలిపారు. తెనాలి నియోజకవర్గంలోని కొల్లిపర, తెనాలి మండలాల పరిధిలో 26,500 ఎకరాల్లో వరిసాగు జరుగగా 8వేల ఎకరాల్లో వరికోతలు పూర్తయ్యాయి. వర్షాలకు 18,500 ఎకరాల్లో వరి పైరు నేలవాలింది. తెనాలి మండలంలో మినుము 177 ఎకరాలు, కొల్లిపర మండలంలో మినుము 260 ఎకరాల్లో నీట మునిగినట్లు ఏడీఏ ఉషారాణి తెలిపారు. తెనాలి మండలంలో అరటి 45 ఎకరాలు, కొల్లిపర మండలంలో 300 ఎకరాల్లో అరటిచెట్లు నేలకొరిగినట్లు ఉద్యానశాఖ అధికారిణి ఉష వెల్లడించారు. మిచాంగ్ తుపాను వల్ల ఈదురు గాలులకు తెనాలి, కొల్లిప మండలాల్లో 20 విద్యుత్ స్తంభాలు పడిపోయినట్లు తెనాలి ఏడీ అశోక్‌కుమార్ చెప్పారు. రూ.4లక్షల వరకు నష్టం వాటిల్లినట్లు తెలిపారు.



కొలకలూరులో వరిపైరును పరిశీలిస్తున్న శాస్త్రవేత్తలు

వరి పొలాలను పరిశీలించిన వ్యవసాయ శాస్త్రవేత్తలు

తెనాలిటౌన్: మిచాంగ్ తుపాను ప్రభావంతో దెబ్బతిన్న వరి పొలాలను గురువారం లాంఫామ్ వ్యవసాయ శాస్త్రవేత్తలు, వ్యవసాయాధికారులు పరిశీలించారు. మండలంలోని హాఫ్‌పేట, కొలకలూరు, నందివెలుగు గ్రామాల్లో నీటి మునిగిన వరి పైరును శాస్త్రవేత్తలు డాక్టర్ రత్నం, డాక్టర్ లేపాక్షి, తెనాలి ఏడీఏ ఉషారాణి, ఏవో ప్రేమ్‌సాగర్ సందర్శించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పొలాల్లో నీరు బయటకు పంపించాలని సూచించారు. పైరు పై ఉప్పు ద్రావణాన్ని పిచికారి చేయాలని తెలిపారు. ఏడీఏ ఉషారాణి మాట్లాడుతూ తెనాలి మండలంలో వరి పైరు 11 వేల ఎకరాల్లో నీట మునిగిందన్నారు. మినిము పంట 175 ఎకరాల్లో దెబ్బతిందన్నారు. వీరి వెంట ఏఈవో మోహన్, వీఏవోలు వంశీ, నాగరాజు, మౌనిక, తేజ ఉన్నారు.

వరి పొలాల పరిశీలన

తెనాలిటౌన్: తుపాను కారణంగా దెబ్బతిన్న వరి పొలాలను గురువారం సీపీఐ నాయకులు పరిశీలించారు. ఐతానగర్, నేలపాడు గ్రామాల్లో జిల్లా కార్యదర్శి జంగాల అజయ్‌కుమార్, నియోజకవర్గ కార్యదర్శి చెరుకుమల్లి సింగారావు పర్యటించారు. ఈ సందర్భంగా అజయ్‌కుమార్ మాట్లాడుతూ ప్రభుత్వం నష్టపోయిన రైతులను ఆదుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఏఐఎస్ఎఫ్ జిల్లా అధ్యక్షుడు పాశం వెంకటేష్, సీపీఐ పట్టణ కార్యదర్శి మద్దినేని కిరణ్‌బాబు, రవితేజ, రాజేష్, బొల్లిముంత కృష్ణ, పరుచూరు వెంకటేశ్వరరావు, కోలా శేఖర్, శ్యామ్, బుజ్జి, రైతులు పాల్గొన్నారు.



నేలపాడులో వరిపైరును పరిశీలిస్తున్న సీపీఐ నాయకుల

గ్రామాల అభివృద్ధికి సీఎం జగనే కావాలి

ఎమ్మెల్యే అన్నాబత్తుని శివకుమార్

తెనాలిరూరల్: సంక్షేమాంధ్రప్రదేశ్‌గా రాష్ట్రాన్ని తీర్చి దిద్దడంతో పాటు ప్రతి గ్రామాన్ని అభివృద్ధి చేయాలన్నదే ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ధ్యేయమని, ఆంధ్రప్రదేశ్‌కు జగనన్న అందుకే కావాలని ఎమ్మెల్యే అన్నాబత్తుని శివకుమార్ అన్నారు. 'ఆంధ్రప్రదేశ్‌కు జగనే ఎందుకు కావాలంటే' కార్యక్రమంలో తెనాలి మండలం పెదరావూరు గ్రామంలో గ్రామ సచివాలయం-2 పరిధిలో పల్లెకు పోదాం కార్యక్రమాన్ని గురువారం సాయంత్రం నిర్వహించారు. ఈ సందర్భంగా జరిగిన సభలో ఎమ్మెల్యే శివకుమార్ మాట్లాడుతూ 2019లో అధికారంలోకి వచ్చిన నాటి నుంచి ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి రాష్ట్రంలోని అన్ని వర్గాలకు సమ ప్రాధాన్యతనిస్తూ సుపరిపాలనను అందిస్తున్నారని చెప్పారు. ఒక్క పెదరావూరు గ్రామంలోనే సంక్షేమ పథకాల కింద రూ. 20,40,911 నగదు ప్రజల ఖాతాల్లో నేరుగా జమ చేసినట్లు తెలిపారు. అమ్మ ఒడి పథకం కింది 322 కుటుంబాలకు రూ.1,41, 57,234లు, విద్యా దీవెన ద్వారా 369 కుటుంబాలకు రూ.96 అందించినట్లు తెలిపారు. గత ప్రభుత్వంలో గ్రామంలో 700 మందికి మాత్రమే పింఛన్లు ఇచ్చేవారని, ప్రస్తుతం 993 మందికి ఇస్తున్నట్లు తెలిపారు. వెల్‌నెస్ సెంటర్, ఆర్‌బీకే భవనం, సచివాలయాలు, రోడ్లు వంటి కార్యక్రమాలకు రూ. 2.42 కోట్లు కేటాయించి పనులు పూరి చేసినట్లు వివరించారు. 'నాడు-నేడు' పథకం కింద గ్రామంలోని జెడ్పీ హైస్కూలు రూ. 1.09 కోట్లు కేటాయించి అభివృద్ధి చేశామని చెప్పారు. ప్రతి కుటుంబానికి సంక్షేమం అందించాలన్న చిత్తశుద్ధితో ముఖ్యమంత్రి పని చేస్తున్నారని చెప్పారు. పెదరావూరు గ్రామంలో 73 కుటుంబాలకు రూ. 19 లక్షలు ఈబీసీ నేస్తం కింద అందించినట్లు ఎమ్మెల్యే తెలిపారు. గ్రామంలో డీబీటీ, నాన్ డీబీటీ కింద పేద వారికి రూ. 26,70,40, 911 అందించామని వివరించారు. అన్ని వర్గాలకు జగన్‌మోహన్‌రెడ్డి పాలనలో సమ న్యాయం జరుగుతోందని శివకుమార్ అన్నారు. కరోనా కష్టకాలంలో ఇతర పార్టీల నాయకులెవరూ ప్రజలను పట్టించుకోలేదని, ఎన్నికలకు మూడు నెలల ముందు సూట్‌కేసు వేసుకుని వచ్చి ఇక్కడ పోటీ చేస్తున్నట్లు చెబుతున్నారని ఎద్దేవా చేశారు. అనంతరం గ్రామంలో వైఎస్సార్‌సీపీ జెండాను ఆవిష్కరించి, చివాలయం పరిధిలో పలు ఇళ్లకు వెళ్లి ఆంధ్రప్రదేశ్‌కు జగనే ఎందుకు కావాలంటే కరపత్రాన్ని గత ప్రభుత్వం ఇచ్చిన హామీలు, ప్రస్తుత ప్రభుత్వం అమలు చేసిన హామీలతో కూడిన కరపత్రాన్ని అందించి పథకాల గురించి వివరించారు. గ్రామ సర్పంచ్ కాకి రమాదేవి, మాజీ ఎంపీపీ చెన్నుబోయిన శ్రీనివాసరావు, కుదరవల్లి శంకరరావు, కాకి మనోజ్, ఎండీ ఫరీద్, గొరికపూడి బాలరాజు పాల్గొన్నారు.



సభలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే శివకుమార్

నేటి 'వై ఏపీ నీడ్స్ జగన్' కార్యక్రమాలు

తెనాలిఅర్బన్: తెనాలి పట్టణ పరిధిలోని 13, 30, 31 వార్డులలో వై ఏపీ నీడ్స్ జగన్ కార్యక్రమాన్ని శుక్రవారం నిర్వహించనున్నట్లు మున్సిపల్ కమిషనర్ ఎం.జశ్వంతరావు గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. 13వ వార్డు చినరావూరు-3 సచివాలయం వద్ద ఉదయం 11 గంటలకు, 30, 31వ వార్డు చెంచుపేటలోని సచివాలయాల వద్ద మధ్యాహ్నం 3గంటలకు సభలు నిర్వహించనున్నట్లు తెలిపారు. అలాగే సచివాలయాలలో సంక్షేమ పథకాల లబ్ధిదారుల వివరాలు తెలియజేసే బోర్డులను ఆవిష్కరించనున్నట్లు తెలిపారు. కౌన్సిలర్లు, అధికారులు పాల్గొనాలని పేర్కొన్నారు.

నష్టపోయిన రైతులను ఆదుకోవాలి

తాడేపల్లిరూరల్: మిచాంగ్ తుఫాన్ కారణంగా నష్టపోయిన రైతులకు నష్టపరిహారం అందజేయాలని కోరుతూ గురువారం దుగ్గిరాల డిప్యూటీ తహసీల్దార్ యు.రాజేష్‌కు సీపీఎం నాయకులు వినతి పత్రం అందజేశారు. సీపీఎం మండల కార్యదర్శి జెట్టి బాలరాజు మాట్లాడుతూ మిచాంగ్ తుఫాన్ వలన నష్టపోయిన వరి పంటకు ఎకరానికి రూ.20 వేలు, వాణిజ్య పంటలైన మినుము, అరటి, నిమ్మ, తోటలకు రూ.50 వేలు ఇవ్వాలని కోరారు. రెండో పంట సాగుకు జొన్న, మొక్కజొన్న, మినుము, పెసర విత్తనాలు ప్రభుత్వం ఉచితంగా పంపిణీ చేయాలని అన్నారు. పార్టీ నాయకులు ఎన్.యోగేశ్వరరావు, వై.బ్రహ్మేశ్వరరావు, కె.కోటయ్య, కె. దావీదు, ప్రభాకర్, సీహెచ్.పోతురాజు తదితరులు పాల్గొన్నారు.

కార్పొరేటర్ల నుంచి అందే ఫిర్యాదులపై నివేదిక ఇవ్వాలి

జీఎంసీ కమిషనర్ కీర్తి చేకూరి

నెహ్రూనగర్: కార్పొరేటర్ల నుంచి అందే ఫిర్యాదులు, అర్జీల పరిష్కారంపై వార్డుల వారీగా నివేదిక ఇవ్వాలని విభాగాధిపతులకు నగర కమిషనర్ కీర్తి చేకూరి స్పష్టం చేశారు. గురువారం కమిషనర్ ఛాంబర్‌లో నగరంలోని కార్పొరేటర్లతో వార్డుల్లో అభివృద్ధి పనులు, స్థానిక సమస్యలపై ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ నగరంలో ప్రజా ప్రతినిధులు, ప్రజలతో మమేకమై ఉంటారని, వారు గుర్తించిన సమస్యలను వెంటనే పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. ప్రస్తుతం తుఫాన్ కారణంగా నగరంలో ఎక్కడైనా సమస్యలు ఉంటే తమ దృష్టికి తీసుకురావచ్చని కార్పొరేటర్లకు సూచించారు. ఇప్పటివరకు వార్డుల వారీగా కార్పొరేటర్లు అందించిన అర్జీలు, వాటి పరిష్కారంపై నివేదిక ఇవ్వాలని ఆయా విభాగాధిపతులను ఆదేశించారు. అధికారులు, ప్రజా ప్రతినిధులు సమన్వయంతో పని చేసినప్పుడే ప్రజా సమస్యలు పరిష్కారం, నగర సమగ్రాభివృద్ధి జరుగుతుందన్నారు. వార్డుల్లో మౌలిక వసతులు, అభివృద్ధి పనులపై కార్పొరేటర్లు కూడా కమిషనర్‌తో చర్చించడానికి ప్రతి శుక్రవారం ప్రత్యేకంగా సమయం కేటాయించడం జరిగిందన్నారు. మిగిలిన రోజుల్లో కార్పొరేటర్లకు అందుబాటులో ఉంటామని, వాట్సాప్‌లో సమస్యలు తెలిపినా తగిన చర్యలు తీసుకుంటామన్నారు. కార్పొరేటర్ల నుంచి అందే అర్జీలు, ఫిర్యాదులు, ప్రతిపాదనలను క్రమపద్ధతిలో రికార్డ్ చేసి, తదుపరి చర్యలు కూడా వారికి తెలియజేయాలని ఆదేశించారు.

నిర్దేశిత గడువులోగా అభివృద్ధి పనులు పూర్తి చేయాలి..

నగరంలో టెండర్ పొందిన కాంట్రాక్టర్లు అభివృద్ధి పనులను నిర్దేశిత గడువులోగా, నాణ్యతా ప్రమణాలు పాటిస్తూ పూర్తి చేయాలని, కాంట్రాక్టర్ల సమస్యల పరిష్కారానికి తగిన చర్యలు తీసుకుంటామని నగర కమిషనర్ కీర్తి చేకూరి తెలిపారు. గురువారం కమిషనర్ ఛాంబర్ లో నగరపాలక సంస్థ కాంట్రాక్టర్లతో కమిషనర్ స్పెషల్ గ్రీవెన్స్ ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ నగరంలో అభివృద్ధి పనులు నిర్వహించే కాంట్రాక్టర్ల సమస్యల సత్వర పరిష్కారానికి ప్రత్యేకంగా గ్రీవెన్స్ నిర్వహిస్తున్నామన్నారు. కాంట్రాక్టర్లు ఎదుర్కొంటున్న సమస్యలను తమ దృష్టికి తెచ్చారని, వాటిని నిర్దేశిత గడువులో పరిష్కారం చేయాలని ఇంజినీరింగ్ అధికారులను ఆదేశించారు. కాంట్రాక్టర్లు వర్క్ అగ్రిమెంట్ పొందిన అభివృద్ధి పనులను నిర్దేశిత గడువులోగా పనులు పూర్తి చేసినప్పుడే నగర అభివృద్ధి జరుగుతుందని, కాంట్రాక్టర్లు తాము పూర్తి చేసిన పనులకు సంబంధించి బిల్లుల ఆన్‌లైన్ చేయడం, చెల్లింపుల్లో ఎదురయ్యే సమస్యలను ప్రతి శుక్రవారం జరిగే స్పెషల్ గ్రీవెన్స్‌లో తమ దృష్టికి తీసుకురావచ్చన్నారు. కాంట్రాక్టర్లు అందించిన అర్జీలను, ఫిర్యాదులను ప్రత్యేకంగా నమోదు చేయాలని, వారి సమస్యలు పరిష్కారం అయ్యాక తెలియచేయాలని అధికారులను ఆదేశించారు. బిల్లుల చెల్లింపులో జాప్యం లేకుండా అన్ని స్టేజిల్లో వేగంగా రికార్డ్ అయ్యేలా చర్యలు తీసుకోవాలని ఎస్ఈని ఆదేశించారు. కాంట్రాక్టర్లు తాము చేపట్టే పనుల్లో నాణ్యతా ప్రమాణాలు పాటించాలన్నారు.



కాంట్రాక్టర్లతో సమావేశమైన కమిషనర్ కీర్తి చేకూరి

కార్మికులకుల కుటుంబాలకు అండగా ఉంటాం

నెహ్రూనగర్: నగరపాలక సంస్థ కార్మికుల కుటుంబాలకు అండగా ఉంటామని, కార్మికులకు అందాల్సిన పరిహారాలు వెంటనే అందిచడానికి ప్రత్యేక చర్యలు తీసుకుంటామని నగర కమిషనర్ కీర్తి చేకూరి తెలిపారు. ఇటీవల మరణించిన ఇంజినీరింగ్ విభాగం కార్మికురాలు వి.విజయకుమారి కుటుంబ సభ్యులకు ఎక్స్‌గ్రేషియా చెక్‌ను గురువారం కమిషనర్ చాంబర్‌లో ఆమె భర్తకు అందజేశారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ విధి నిర్వహణలో ప్రమాదవశాత్తు మరణించిన కార్మికుల కుటుంబాలకు నగరపాలక సంస్థ అండగా ఉంటుందన్నారు. ఇంజినీరింగ్ విభాగంలో అవుట్ సోర్సింగ్ విధానంలో గాంధీ పార్క్‌లో విధులు నిర్వహించే టి.విజయకుమారి ఇటీవల కాలంలో మరణించారని ఆమె భర్త రమణారావుకు నగరపాలక సంస్థ నుంచి ఎక్స్ గ్రేషియా రూ.2 లక్షలు, మట్టి ఖర్చులు రూ.15 వేలకు సంబంధించిన చెక్‌ని అందించామన్నారు. పి.ఎఫ్. కూడా త్వరగా అందేలా చర్యలు తీసుకోవాలన్నారు.

నగరంలో ప్రత్యేక పారిశుద్ధ్య పనులు..

నెహ్రూనగర్: గుంటూరు నగరంలో మిచాంగ్ తుఫాన్ అనంతరం అంటు వ్యాధులు ప్రబలకుండా ప్రణాళికాబద్ధంగా ప్రత్యేక పారిశుద్ధ్య పనులు చేపట్టాలని నగర కమిషనర్ కీర్తి చేకూరి ప్రజారోగ్య అధికారులను ఆదేశించారు. గురువారం తుఫాన్ అనంతరం నగరంలో ప్రత్యేక పారిశుద్ధ్య పనుల నిర్వహణపై డిప్యూటీ కమిషనర్, ఎంహెచ్‌ఓ, శానిటరీ సూపర్‌వైజర్లతో ప్రత్యేక సమావేశం జరిగింది. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ తుఫాన్ వలన వర్షం నీరు నిల్చిన ప్రాంతాల్లో బెయిల్ అవుట్ చేశాక ప్రజారోగ్య సిబ్బంది తప్పనిసరిగా ప్రత్యేక పారిశుద్ధ్య పనులు చేపట్టాలని, అందులో భాగంగా బ్లీచింగ్ చల్లడం, రోడ్ల మీద పేరుకున్న సిల్ట్ తొలగించడం, కల్వర్ట్‌ల వద్ద నిలిచిన అడ్డంకులను తొలగించాలన్నారు. డిప్యూటీ కమిషనర్ రవీంద్ర, ఎంహెచ్‌ఓ (ఎఫ్ఏసీ) మధుసూదన్, ఎస్ఎస్‌లు ఆనందకుమార్, ఆయుబ్ ఖాన్, సోమ శేఖర్ పాల్గొన్నారు.

సంక్షేమ పథకాల కొనసాగింపు సీఎం జగన్‌కే సాధ్యం

మున్సిపల్ చైర్‌పర్సన్ రాధిక

తెనాలిఅర్బన్: రాష్ట్రంలో అమలవుతున్న సంక్షేమ పథకాలు కొనసాగాలంటే మరోసారి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని ముఖ్యమంత్రిగా చేయాల్సిన బాధ్యత అందరిపై ఉందని మున్సిపల్ చైర్‌పర్సన్ తాడిబోయిన రాధిక పేర్కొన్నారు. వై ఏపీ నీడ్స్ జగన్ కార్యక్రమాన్ని 12వ వార్డు చినరావూరు డొంక రోడ్డులోని సచివాలయం వద్ద గురువారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో ఆమె మాట్లాడారు. దేశంలో ఎక్కడాలేని విధంగా ఎన్నికల హామీలన్నింటిని రాష్ట్ర ప్రభుత్వం అమలు చేసిందన్నారు. సీఎం జగన్ అధికారం చేపట్టిన తర్వాత ప్రతి హామీని నూరు శాతం అమలు చేశారని గుర్తుచేశారు. కరోనా, ప్రకృతి వైపరీత్యాలు సంభవించినప్పుడు వలంటీర్లు అందించే సేవలు మరువరానివని కొనియాడారు. సచివాలయ వ్యవస్థను ఇతర రాష్ట్రాలు కూడా అమలు చేసేందుకు చర్యలు తీసుకుంటున్నట్లు చెప్పారు. 12వ వార్డు వైఎస్సార్ సీపీ కౌన్సిలర్ కొత్ర యశోద మాట్లాడుతూ వార్డులో ఇప్పటి వరకు రూ.18.10 కోట్ల సంక్షేమ పథకాల లబ్ధి ప్రజలకు చేకూర్చినట్లు వివరించారు. రానున్న ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీకి ఓట్లు వేసి గెలిపించాలని కోరారు. అనంతరం సచివాలయంలో ఏర్పాటు చేసిన సంక్షేమ పథకాల లబ్ధిదారుల వివరాలు తెలియజేసే బోర్డును, జగన్ ఆంధ్రప్రదేశ్‌కు ఎందుకు అవసరం అనే బుక్‌లెట్‌ను చైర్‌పర్సన్ ఆవిష్కరించారు.

ఈ సమావేశంలో మున్సిపల్ మేనేజర్ అప్పలరాజు, వైఎస్సార్ సీపీ తెనాలి పట్టణ క్లస్టర్-1 అధ్యక్షుడు మద్దాళి శేషాచలం, భట్టరాజు కార్పొరేషన్ డైరెక్టర్ రాళ్లబండి సుష్మ, వైఎస్సార్‌సీపీ నాయకులు దేవరపల్లి కిషోర్ కుమార్, సచివాలయ ఉద్యోగులు, వలంటీర్లు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న చైర్ పర్సన్ రాధిక

తైక్వాండోలో మెరిసిన బిందుమాధవి

తెనాలి: తైక్వాండో జాతీయ పోటీల్లో పతకం సాధించిన ఆరో తరగతి విద్యార్థిని దాసరి బిందు మాధవిని ఎమ్మెల్యే అన్నాబత్తుని శివకుమార్ అభినందించారు. డెహ్రాడూన్‌లో ఈ నెల 1-3 తేదీల్లో జరిగిన 11వ జాతీయ తైక్వాండో పోటీల్లో 41 కిలోల విభాగంలో పాల్గొన్న బిందుమాధవి కాంస్య పతకం సాధించింది. అంతకుముందు స్థానిక జేఎంజే మహిళా కాలేజి ప్రాంగణంలో జరిగిన రాష్ట్రస్థాయి పోటీల్లో ఇదే విభాగంలో బిందుమాధవి బంగారు పతకం సాధించి, జాతీయ పోటీలకు అర్హత సాధించింది. ఇదే స్ఫూర్తిని కొనసాగిస్తూ మరెన్నో విజయాలను సాధించాలని ఎమ్మెల్యే శివకుమార్ సూచించారు. బిందుమాధవి స్థానిక గంగానమ్మపేటలోని కేకేఆర్ గౌతమ్ పాఠశాలలో ఆరో తరగతి చదువుతోంది.



బిందుమాధవిని అభినందించిన ఎమ్మెల్యే శివకుమార్

'ఉపాధి హామీ ప్రభావం'పై పరిశోధనకు డాక్టరేట్

తెనాలి: 'అణగారిన సమూహాలపై మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం ప్రభావం. భారతదేశంలో ఆంధ్రప్రదేశ్‌లోని గుంటూరు జిల్లాలో ఒక అధ్యయనం'పై సమర్పించిన పరిశోధన వ్యాసానికి దాసరి ఏడుకొండలుకు ఆచార్య నాగార్జున యూనివర్శిటీ పీహెచ్‌డీ ప్రదానం చేసింది. యూనివర్శిటీ స్కూల్ ఆఫ్ సోషల్ సైన్సెస్ డీన్ ఆచార్య త్రిమూర్తిరావు చేతులమీదుగా ఏడుకొండలు గురువారం డాక్టరేట్ పట్టాను స్వీకరించారు. ఆయన స్వగ్రామం నగరం మండల గ్రామం బెల్లం వారిపాలెం. నిరుపేద కుటుంబంలో జన్మించిన ఏడుకొండలు చదువు సుదీర్ఘంగా సాగింది. జీవనం కోసం రకరకాల పనుల్లో గడిపారు. సోషల్ సైన్స్‌లో పీజీ చేశారు. స్నేహితుల ప్రోత్సాహంతో స్టేట్ ఎలిజిబిలిటీ (సెట్) పరీక్ష పాసయ్యారు. ఆచార్య త్రిమూర్తిరావు పర్యవేక్షణలో జరిపిన పరిశోధనా వ్యాసానికి పీహెచ్‌డీ సాధించటం విశేషం. నిరుపేదలు అయినప్పటికీ తల్లిదండ్రులు తనను బడికి పంపించటం గొప్ప విషయమని ఏడుకొండలు అన్నారు. ఎన్ని అవరోధాలు ఎదురైనా చదువును కొనసాగిస్తూ రావటమే తన విజయానికి కారణం అన్నారు.



డాక్టరేట్‌ను స్వీకరిస్తున్న ఏడుకొండలు

ఈ రోజు కాదు..ఇంకెప్పుడు?

పట్టణంలోని సత్యనారాయణ పార్కు సమీపంలోని విద్యుత్ ఇన్‌డోర్ సబ్ స్టేషనులోని విద్యుత్ బిల్లు వసూలు కేంద్రం వద్ద కొద్దిరోజులుగా 'ఈరోజు సెలవు' బోర్డు దర్శనమిస్తోంది. ఏ రోజు వెళ్లినా అదే బోర్డు కనిపిస్తోంది. సిబ్బంది ఎవరూ కనిపించటం లేదు. దీనితో విద్యుత్ బిల్లు చెల్లింపుదారులు తిరిగి వెళ్లాల్సివస్తోంది. ఆ బోర్డుకు బదులుగా ఏరోజు నుంచి బిల్లులు స్వీకరిస్తారో తెలిపే బోర్డు పెడితే బాగుంటుందని సూచిస్తున్నారు. – తెనాలి



విద్యార్థులకు దిక్సూచిగా ఎస్ఎస్‌సీ మోడల్ పేపర్స్



యూటీఎఫ్ నాయకులతో కలిసి ఎస్ఎస్‌సీ మోడల్ పేపర్స్ ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్సీ లక్ష్మణరావు

గుంటూరు ఎడ్యుకేషన్: పదో తరగతి పబ్లిక్ పరీక్షలకు హాజరయ్యే విద్యార్థులకు అధిక మార్కుల సాధన దిశగా యూటీఎఫ్ ముద్రించిన ఎస్ఎస్‌సీ మోడల్ పేపర్స్ ప్రయోజనం చేకూర్చుతాయని ఎమ్మెల్సీ కేఎస్ లక్ష్మణరావు పేర్కొన్నారు. బ్రాడీపేటలోని యూటీఎఫ్ జిల్లా కార్యాలయంలో గురువారం యూటీఎఫ్ రూపొందించిన ఎస్ఎస్‌సీ మోడల్ పేపర్స్ బుక్‌లెట్‌ను ఆవిష్కరించారు. ముఖ్య అతిథిగా పాల్గొన్న ఎమ్మెల్సీ లక్ష్మణరావు మాట్లాడుతూ బుక్‌లెట్‌లో ముందుమాటను పాఠశాల విద్యాశాఖ కమిషనర్ ఎస్.సురేష్‌కుమార్ రాశారని తెలిపారు. వ్యాపార ధోరణితో కాకుండా నామమాత్రపు ధరకే పుస్తకాన్ని అందించడం అభినందనీయమన్నారు. యూటీఎఫ్ రాష్ట్ర ప్రచురణల కమిటీ చైర్మన్ ఎం.హనుమంతరావు మాట్లాడుతూ మార్చిలో జరగనున్న టెన్త్ పబ్లిక్ పరీక్షల ప్యాట్రన్‌లోనే టెన్త్ సబ్జెక్టుల బోధనలో రాష్ట్రస్థాయిలో నిపుణులైన ఉపాధ్యాయులతో మోడల్ పేపర్లను రూపొందించామని, అత్యుత్తమ మోడల్ పేపర్లను అందించడంలో యూటీఎఫ్‌కు గుర్తింపు ఉందని చెప్పారు. యూటీఎఫ్ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు బి.ఆదిలక్ష్మి, ఎం.కళాధర్ మాటాడుతూ విద్యార్థులందరు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. సంఘ జిల్లా సహాధ్యక్షులు జి.వెంకటేశ్వర్లు, ఏఎల్ శివపార్వతి, కోశాధికారి ఎండీ దౌలా, కార్యదర్శులు పాల్గొన్నారు.

ప్రభుత్వ పథకాలపై అవగాహన

ఫిరంగిపురం: మండల కేంద్రంలోని పంచాయతీ కార్యాలయంలో గురువారం వికసిత్ భారత్ కార్యక్రమం నిర్వహించారు. కేంద్ర ప్రభుత్వ పథకాలను అధికారులు వివరించారు. కిసాన్ సమ్మాన్ నిధి, కిసాన్ క్రెడిట్ కార్డులు, ప్రధాన మంత్రి మాతృత్వ యోజన, ప్రధానమంత్రి ఆవాస్‌యోజన, జలజీవన్ మిషన్ వంటి అంశాలపై లబ్ధిదారులకు వివరించారు. సర్పంచ్ ఎం.బాబు, ఈవోపీఆర్డీ నిర్మలాలక్ష్మీ కుమారి, జీవిఆర్‌కేమూర్తి, ఏవో వాసంతి, కార్యదర్శి కె.విష్ణువర్ధన్‌రావు, వెంకటేశ్వర్లు, లాంఫాం శాస్త్రవేత్త గంగాదేవి, హేమలత, బీజేపీ నాయకులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.